
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
3
ఆదివారం 2 జూన్ 2024







అసంపూర్తిగా రోడ్డు విస్తరణ

చొప్పదండిలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

- చొప్పదండిలో నిలిచిపోయిన పనులు
- ఇబ్బందులు పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చొప్పదండి, జూన్ 1: చొప్పదండి పట్టణంలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆర్భాటంగా పనులు ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల కోడ్ రావడంతో మధ్యలోనే వదిలి వేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసినా పనులవైపు కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యారు. దీంతో నిత్యం ఈ రోడ్డులో వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. చొప్పదండి పట్టణ అభివృద్ధిలో భాగంగా గత అక్టోబరులో పట్టణంలోని ప్రధాన రహదారి నాలుగు కిలో మీటర్ల వరకు రోడ్డును విస్తరించి, మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రోడ్డును ఆనుకొని ఉన్న ఇళ్లను రోడ్డు విస్తరణ పేరిట కూల్చివేశారు. ఈ క్రమంలో చాలా మంది ప్రజలు ఇళ్లు కోల్పోయారు. ఇళ్లు కూల్చివేసి మధ్యలో డివైడర్ల నిర్మాణ పనులు ఆగమేఘాలపై ప్రారంభించి అర్ధాంతరంగా వదిలిపెట్టారు. రోడ్డు ఇరుకుగా మారడం, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టక పోవడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతు న్నాయి.. తాజాగా రెండు రోజుల క్రితం ఓ లారీ డివైడర్‌ను ఢీకొని రెండు ముక్కలైంది,

● రెండేళ్ల క్రితం శంకుస్థాపన

పట్టణంలోని గుమ్లాపూర్ క్రాస్ రోడ్ నుంచి డి-86 కాలువ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 100 అడుగుల మేరకు విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం 2022 ఫిబ్రవరిలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు శంకుస్థాపన చేశారు. 33 కోట్ల రూపాయలు మంజూరు కాగా, ఎలాంటి అనుభవం లేని కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పారు. రోడ్డుకు రెండువైపులా డ్రైనేజీ నిర్మాణం పూర్తికాగా విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, రోడ్డు వెడల్పు చేయాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుండా రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. ప్రతినిత్యం వందలాది భారీ వాహనాలు వెళ్తున్న క్రమంలో రోడ్లను వెడల్పు చేసిన తర్వాత డివైడర్‌ను నిర్మిస్తే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేది. రెండువైపులా ఉన్న మట్టి రోడ్డుపై గుంతలు పడగా, అక్కడ అక్కడ డ్రైనేజీ నిర్మాణం పూర్తి కాలేదు.

● ఎన్నికల ముందు హడావుడి...



డివైడర్‌ను ఢీకొని ధ్వంసమైన లారీ

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో పాటు రోడ్డు వెడల్పు పనులకు అసెంబ్లీ ఎన్నికల ముందు ఎంత హడావుడి చేశారు. నిర్మాణం పూర్తయితే ఇలా ఉంటుందంటూ అధికారులు గ్రాఫిక్స్‌ను విడుదల చేసి అత్యుత్సాహం ప్రదర్శించారు. పనుల్లో వేగం చూసి ప్రజలు రోడ్డు పనులు పూర్తవు తాయని భావించారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారగానే పనులు నిలిచిపోయాయి. తమకు బిల్లులు రావాల్సి ఉందంటూ కాంట్రాక్టర్ చెబుతుండగా, పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఈ సందర్భంగా ప్రజలు కోరుతున్నారు.



అంజనాద్రిపై కిక్కిరిసిన భక్తులు

పవనసుత హనుమాన్ కీ జై

● భక్తిశ్రద్ధలతో హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 1: జిల్లా వ్యాప్తంగా హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలను ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాలు భజనలు, కీర్తనలతో మార్మోగాయి. భారత్‌టాకీస్ రోడ్ వీరాంజనేయస్వామి ఆలయంలో, కాశ్మీరగడ్డ లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, భగత్‌నగర్ అంజనాద్రిపై ఆలయంలో యజ్ఞవరాహక్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో, కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి, ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రాంనగర్ రమాసత్యనారాయణ స్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలో, రామేశ్వరాలయ ఆంజనేయ స్వామి సన్నిధిలో, మారుతినగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో, జ్యోతినగర్ హను మాన్ సంతోషిమాత, లేబర్‌అడ్డా భక్తాంజనేయస్వామి ఆలయంలో, వావిలాలపల్లి హనుమత్ సహిత కనకదుర్గ, భక్తాంజనేయస్వామి ఆలయంలో, శ్రీహరినగర్ వీరాంజనేయస్వామి ఆలయంలో, పాతబ జార్ చిన్నహనుమాన్ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. ఆదర్శనగర్ రాజరాజేశ్వర అభయాంజనేయస్వామి ఆలయంలో, రామచంద్రాపూర్ కాలనీ రామభక్తాంజనేయస్వామి ఆలయంలో, విద్యా నగర్ నవీన కుర్మవాడ బాలభక్తాంజనేయస్వామి ఆలయంలో, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, పసుల నారాయణ కాలనీ పంచముఖ ఆంజనేయ విశ్వేశ్వరాలయంలో పూజలు చేశారు.



కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

బిల్లులు వచ్చేదెన్నడు?

● ఆందోళనలో మాజీ సర్పంచ్‌లు ● నిధుల కొరతే కారణమా?



గంగాధర, జూన్ 1: గ్రామాభివృద్ధికి చేసిన పనుల బిల్లుల రాక మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిలో డబ్బులు లేకున్నా అధికారుల ఒత్తిడితో అక్కడా.. ఇక్కడా అప్పులు చేసి అప్పటి సర్పంచులు పనులు చేశారు. బిల్లుల కోసం ఆశగా ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలింది. గంగాధర మండలంలోని 23 గ్రామ పంచాయతీలుండగా గ్రామాల్లో సర్పంచ్‌లు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వాటికి సంబంధించిన నిధులను 2022 అక్టోబరు నుంచి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. 2023లో కేంద్ర ప్రభుత్వ నిధులు వచ్చాయి. అప్పటికే అభివృద్ధి పనులకు చేసిన అప్పుల పాలైన సర్పంచ్‌లు కొద్దోగొప్పో బిల్లులు వస్తాయని సంతోషించారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలు వస్తాయని, కోడ్ రాకముందే ఆగస్టు, సెప్టెంబరు నెలలో చెక్కులు తయారు ఆన్‌లైన్ చేశారు. నిధులు జమవుతాయని సర్పంచ్‌లు ప్రతి రోజు బ్యాంకులో బ్యాలెన్స్ చెక్ చేసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియడంతో చెక్కులు పనికి రాకుండా పోయాయి. దీంతో చెక్కులు తిరిగి రాగా నిధులు గ్రామ పంచాయతీల్లో జమయ్యాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో పడడంతో సర్పంచ్‌లు ఇబ్బందులకు గురవుతున్నారు.

● స్పెషల్ ఆఫీసర్ల చుట్టూ ప్రదక్షిణలు:

సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఒక్కో ప్రత్యేకాధికారికి రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించింది. పవర్‌లో లేని సర్పంచ్‌లకు తిరిగి డబ్బులు రావాలంటే చెక్కుల రూపంలో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు సంతకాలు చేయవలసి ఉంటుంది. ప్రత్యేకాధికారులకు తమ విధులు నిర్వహిస్తూ గ్రామాలకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు మాజీ సర్పంచ్‌లు గ్రామాల్లో ప్రత్యేకాధికారుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

భారీగా గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 1: కరీంనగర్ పోలీసులు 70 కిలోల గంజాయిని పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. శనివారం కరీంనగర్ బైపాస్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏపీ31బీహెచ్ 2925 నంబర్ కారులో తరలిస్తున్న 70 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. కారులో ఉన్న ముగ్గురి నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా గంజాయిని ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిపారన్నారు. నిందితులను విశాఖ జిల్లా కొమ్మాదికి చెందిన సెరకనం రామకృష్ణ (51), కాకినాడకు చెందిన కిర్లంపూడికి చెరందిన దొడ్డి మణికంఠ (39) మహారాష్ట్రలోని పబ్బని జిల్లా భీమ్‌నగర్‌కు చెందిన ధర్మేంద్రకుమార్ అలియాస్ సల్మాన్ అన్సారీ (26)గా గుర్తించామన్నారు. వారిని అరెస్టు చేసి ఎన్‌డీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. గంజాయి పట్టుకున్న వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్ ఎస్సై స్వామితో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



గంజాయి ప్యాకెట్లను మీడియాకు చూపుతున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్, పోలీసులు

రేపటి నుంచి ‘పది’ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్ టౌన్, జూన్ 1: పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

త్వరలో సహకార సంఘాల ఎన్నికలు

కరీంనగర్ టౌన్, జూన్ 1: జిల్లాలోని మూడు మత్స్య, పారిశ్రామిక సహకార సంఘాలకు, ఒక గొర్రెల పెంపకందారుల సహకార సంఘానికి ఈనెల 6 నుంచి 28వ తేదీల మధ్య ఎన్నికలను నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు జిల్లా సహకార అధికారి ఎస్ రామానుజాచార్య ఓ ప్రకటనలో తెలిపారు. పదవీకాలం ముగియనున్న సహకార సంఘాల పాలకవర్గాలు 60 రోజుల ముందు ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాతో ఎన్నికల ప్రతిపాదనలను తెలంగాణ రాష్ట్ర సహకర ఎన్నికల ప్రాధికారానికి సమర్పించాలని సూచించారు.

నేడు తెలంగాణ అవతరణ దినోత్సవం

● అమరవీరుల కుటుంబాలను సన్మానించనున్న కలెక్టర్

కరీంనగర్ టౌన్, జూన్ 1: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల వరకు జరిగే ఈ వేడుకల్లో తెలంగాణ అమరవీరుల కుటుంబాలను కలెక్టర్ పమేలా సత్పతి సన్మానిస్తారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ పమేలా సత్పతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారు. 9.20 గంటల నుంచి 9.30 గంటల వరకు అమరవీరుల కుటుంబ సభ్యులను కలెక్టర్ సన్మానిస్తారు.



తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు సిద్ధమైన కలెక్టరేట్ కార్యాలయం

బద్దెనపల్లిలో రోడ్డు ప్రమాదం

- నలుగురికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి, జూన్ 1: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ శివారులో ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల గణేష్ (35) కుటుంబ సభ్యులతో కలిసి మాల విరమణ కోసం కొండగట్టుకు వెళ్లారు. తిరిగి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం కాగా బద్దెనపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న అటో ఢీకొట్టింది. దీంతో పూజ (22), జశ్వంత్ (16), అటో డ్రైవర్ రాకేష్ 19, మధు (20) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో అనుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే.. తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుతాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ పాత్ర ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎన్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

శ్రీఆంజనేయం



ఆలయ ఆవరణలో భక్తులు

కిక్కిరిసిన దీక్ష విరమణ మండపం



వేలాదిగా తరలివచ్చిన అంజన్న దీక్షాపరులతో కల్యాణ కట్టలో ఏర్పాటు చేసిన దీక్ష విరమణ మంటపం కిక్కిరిసింది. మాల విరమణ ఏర్పాట్లను ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. మాల విరమణ చేసిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. జయంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి
- స్వామివారిని దర్శించుకున్న లక్షన్నరకు పైగా భక్తులు
- ఘనంగా పెద్ద హనుమాన్ జయంతి



స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

మల్యాల, జూన్ 1: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజన కోటితో కొండగట్టు కిక్కిరిసింది. శుక్రవారం అర్ధ రాత్రి నుంచి శనివారం వరకు రామ లక్ష్మణ జానకీ జై.. బోలో హనుమాన్ కీ.., రామ భక్త హనుమాన్‌కీ జై.. అనే అజన్న దీక్షాపరుల సంకీర్తనలు కొండగట్టు క్షేత్రం మార్మోగిపోయింది. దీంతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. కొండపైన ఎటు చూసినా రామనామ సంకీర్తనలతో కొండంతా మార్మోగింది. లక్షలాదిగా తరలివచ్చిన అంజన్న దీక్షాపరులు, భక్తులు నృత్యాలతో శ్రీరామ భక్తుడు హనుమంతుడిని తమ సంకీర్తనలతో కొలిచారు. రామదండును తలపించేలా శుక్రవారం రాత్రి నుంచి వచ్చిన దాదాపు లక్షకు పైగా వచ్చిన అంజన్న దీక్షాపరులతో కొండంతా కిక్కిరిసిపోగా కొండగట్టు క్షేత్రం కాషాయ వర్ణాన్ని పులుముకుంది. రామనామ స్మరణలతో హోరెత్తింది. 41, 21, 11 రోజుల దీక్ష బూనిన అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని, మాల విరమణ కోసం ఏర్పాటు చేసిన కల్యాణ కట్టలో దీక్షలు విర మించారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారి జేఎన్‌టీయూ మార్గం గుండా రామదండును తలపించేలా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజన సాగరంగా మారింది.



దీక్షాపరుల పాదయాత్ర

● ఘనంగా హనుమాన్ జయంతి

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించే పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా అంజన్న సన్నిధిలో ఉదయం మూడు గంటలకు తిరుమంజనం, ద్రావిడ ప్రబంధ పారాయణములు, విశేష అభిషేకం, తులసీ అర్చన, శ్రీ స్వామి వారికి పట్టు వస్త్రాలంకరణ, సహస్ర నాగవల్లి, అర్చన, హోమం, మహా పూర్ణాహుతితో పాటు ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో త్రైయాహ్నిక, త్రికుండాత్మక యజ్ఞాలను వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పండుగ ప్రత్యేక అధికారులు రామకృష్ణ, వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు తిరు క్కోవెల కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్ ప్రసాద్, రఘు, ఉపప్రధానర్చకులు చిరంజీవ స్వామి, మారుతీ ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● అంజన్నను దర్శించుకున్న విప్, ఎమ్మెల్యేలు

కొండగట్టులో జరుగుతున్న పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి, పెద్ద పల్లి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణారావు అంజన్న దర్శిం చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైదరాబాద్‌కు చెందిన పద్మశాలి సంఘ ప్రతినిధులు తయారు చేసిన పట్టువస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం యాగశాలలో జరుగుతున్న త్రికుండాత్మక యాగంలో పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ దీక్షాపరులు




మాల విరమణ చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు



కొండపైన భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవకులు



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న హనుమాన్ దీక్షాపరులు



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు

- స్టడీసర్కిల్‌లో మరో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ



వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

కరీంనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డీఎస్సీ-2024, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కరీంనగర్, జగిత్యాలలోని తెలంగాణ ఎస్సీ స్టడీసర్కిల్‌లో డీఎస్సీ-2024, ఇతర పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మరో నెల రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా వసతి సౌకర్యం కూడా కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పెద్దఎత్తున ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసేందుకు డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డీఎస్సీ-2024తోపాటు పోటీపరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం ఎస్సీ స్టడీసర్కిల్‌లో రెండు నెలల నుంచి ఇస్తున్న ఉచిత శిక్షణ మే 31తో ముగిసింది. జూలై 17 నుంచి 31వ తేదీ వరకు డీఎస్సీ-2024 నిర్వహిస్తున్నందున ఉచిత శిక్షణ గడువును పొడగించాలని విద్యార్థులు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరడంతో ఆయన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు మరో నెలరోజులపాటు ఉచితశిక్షణ, వసతి కల్పిస్తుందని లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

పాము కాటుకు చిన్నారి మృతి

పెద్దపల్లిటౌన్, జూన్ 1: పాము కాటుతో చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సాగర్ రోడ్డుకు చెందిన నిట్టూరు వైష్ణవి (11) దాహం వేసి ఫ్రిజ్ వద్దకు వెళ్ళి నీళ్ల తాగింది. కాలుకు నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఎలుకలు కాటువేశాయని భావించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలించారు. పాముకాటుకు గురైందని వైద్యులు నిర్ధారించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గంమధ్యలో చిన్నారి మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

ధర్మారం, జూన్ 1: మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన రాంపెల్ల వినోద(54) అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 25న తల నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహాకార మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ధర్మారం, జూన్ 1: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వడదెబ్బతో మృతిచెందాడు. అతడి వయస్సు 35 ఉంటుందని, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, నల్లని గీతల ఫుల్ హాండ్స్ షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఎవరైన గుర్తు పట్టినట్లైతే ఈ క్రింది నంబర్లు ఎస్సై 8712656508, సీఐ 8712656505, ఏసీపీ 8712656507 సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

● గర్షకుర్తిలో వృద్ధురాలు..

గంగాధర: గంగాధర మండలం గర్షకుర్తికి చెందిన వృద్ధురాలు వడదెబ్బతో శనివారం మృతి చెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్షకుర్తికి చెందిన చిందం అన్నవ్వ(86) రేకుల షెడ్డులో ఉంటుంది. ఎండ వేడికి శుక్రవారం రాత్రి వాంతులు చేసుకుని శనివారం ఉదయం మృతి చెందింది.

నాటుసారా పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1: గోదావరిఖని ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని శనివారం ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. నాటుసార తరలిసున్నారనే సమాచారం మేరకు కాలనీలోని మార్కెట్ సమీపంలో కోర మాన్య అనే వ్యక్తిని తనిఖీ చేయగా, నాలుగు లీటర్ల నాటుసార లభ్యమైంది. కోరమాన్యపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు.

ఉపాధిహామీ కూలీలకు పనిముట్లు అందించాలి


కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

భగత్‌నగర్, జూన్ 1: గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికులకు పనిముట్లు అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కవ్వంపల్లి అజయ్, వడ్లరాజులు డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, చింతకుంట గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడుతూ కార్మికులకు పనిముట్లు అందించాలన్నారు. పని ప్రదేశాలలో వాటర్ టెంట్, మెడికల్ కిట్ సదుపాయాలు కల్పించాలన్నారు. రోజు కూలి 600 రూపాయలు 200 రోజుల పని దినాలు కల్పించాలని, పాత బకాయిలు అందించాలన్నారు. పార గడ్డపార తట్టలుకార్మికులకుప్రభుత్వం ఇవ్వాలన్నారు. గ్రామీణ ఉపాధి హామి చట్టం అమలు సవాళ్లుఅనే అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సుకు గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయప్రధాన కార్యదర్శి బి వెంకట్, ఎంపి రాజ్య సభ సభ్యుడు శివదాసం హాజరవుతున్నారన్నారు.

మల్లారపు రత్నాకరశర్మ కన్నుమూత



కరీంనగర్ కల్చరల్, జూన్ 1: కరీంనగర్ వాస్తవ్యుడు, హైదరాబాద్‌లో స్థిర నివాసముంటున్న సంగీతజ్ఞుడు, సీనియర్ పాత్రికేయుడు మల్లారపు రత్నాకరశర్మ (80) శనివారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. 40 సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతితో పాటు వివిధ పత్రికల్లో పాత్రికేయుడిగా పనిచేశారు. సంగీత రంగంలో విశేష కృషి చేశారు. గణపతి సచ్చిదానందస్వామి శిష్యునిగా పేరు గాంచిన ఆయన సచ్చిదానంద కళాపీఠానికి అధ్యక్షుడిగా ఉంటూ ఎనలేని సేవలందించారు.

బాలసాహిత్య సమ్మేళనంలో పాల్గొన్న కరీంనగర్ వాసులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 1: తెలంగాణ సాహిత్యపరిషత్ ఆధ్వర్యంలో 29, 30 తేదీల్లో దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించిన బాలసాహిత్య సమ్మేళనంలో కరీంనగర్‌కు చెందిన కవులు డాక్టర్ బీవీఎన్ స్వామి, కూకట్ల తిరుపతి వక్తలుగా ఉపాధ్యాయుడు కాసు మహేందర్‌రాజు గాయకునిగా పాల్గొన్నారు. బడిలో తెలుగు భాష అంశపై కూకట్ల ప్రసంగించగా బాలసాహిత్యం-ప్రమాణాలు అంశంపై డాక్టర్ బీవీఎన్ స్వామి ప్రసంగించారు. మహేందర్‌రాజు గేయాలను పాడి చిన్నారులను ఆకట్టుకునే విధానంపై పాటలు పాడి వినిపించారు. సదస్సులో అతిథులు, వివిధ విభాలకు చెందిన ప్రముఖులతో పాటు బాల సాహితీవేత్తలు, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

పారమిత ఎన్‌సీసీ కెడెట్ల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 1: తెలంగాణ రాష్ట్రంలోని గజ్వేల్‌లో ఈనెల 1 నుంచి 10 వరకు పది రోజుల పాటు జరగనున్న థల్‌సైనిక్ గ్రూప్ ఫైరింగ్ ఇంటర్ బెటాలియన్ పోటీలకు నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల కెడెట్లు ఎంపికయ్యారు. ఇటీవల 9 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన బెటాలియన్ స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చిన సిహెచ్ సాయివిక్రీత్ పటేల్, రాచమల్ల త్రిదేవ్, దుగ్గ సాహిత్, ఫైరింగ్‌లో ఎంపికయ్యారని పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలజి తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కెడెట్లను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఈ ప్రసాద్‌రావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనూకర్‌రావు, వినోద్‌రావు, రమణ, ప్రకాశ్, హన్మంతరావు అభినందించారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 1: క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని ట్రాన్స్‌కో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో బాస్కెట్ బాల్ మైదానంలో గత నెలరోజులగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో షూటర్స్ బాస్కెట్‌బాల్ అకాడమి నిర్వహించిన బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన శిక్షణ పొందిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు క్రీడలతో మానసిక, శారీరక అభివృద్ధి పెంపొందు తుందన్నారు. నిర్వాహకులను అభినంది తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. మరో అతిథి డీఈ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు ముందు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారు లుగా ఎదగాలని ఆకాంక్షించారు. శిబిరంలో నిర్వహించిన విజేతలకు, క్రీడాకారులకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు జీవన్‌కుమార్, శ్రీధర్‌రావు, సత్యానంద్, సునీల్‌కుమార్, స్పోర్ట్స్ సర్కిల్ ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, కార్య దర్శి ఈఎల్‌పి రాజు, రాజ్‌కుమార్, సుదీప్ కుమార్, వెంకట్‌మాని, వెంకటేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాకేష్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, జూన్ 1: మండలంలోని రంగాపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా రఘునాథ్‌పల్లి మండలం గిద్దెబండ తండాకు చెందిన దీరావత్ రాకేష్(17) అనే యువకుడు తన స్నేహితులు లోతు రామ్‌చరణ్, పసుమతి నిఖిల్‌తో కలిసి జమ్మికుంటలో ఉండే స్నేహితుడిని కలిసేందుకు గత నెల 31న ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటికి వచ్చాడు. స్నేహితుడి ఇంటి నుంచి బయల్దేరిన దీరావత్ రాకేష్, నిఖిల్ ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో రంగాపూర్ గ్రామంలోని విద్యుత్ స్తంభానికి శుక్రవారం అర్ధరాత్రి వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో రాకేష్ తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తోటి స్నేహితులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ దీరావత్ రాకేష్ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు రాకేష్ తల్లి దీరావత్ జనహర్‌లాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూన్ 1: కాశీ దర్శనానికి వెళ్లి వచ్చి జన్మ ధన్యమైందని భావించి గణేష్‌నగర్‌కు చెందిన వృద్ధుడు మాడూరి భూమయ్య అలియాస్ రమేష్ (70) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముప్పై సంవత్సరాల నుంచి ఎల్‌ఎండీ కాలనీలో కిరాణ షాపు నిర్వహిస్తున్న రమేష్ పది రోజుల క్రితం కాశీ యాత్రకు వెళ్లి శుక్రవారం సాయంత్రం తిరిగి వచ్చాడు. రాత్రి తన గదిలోకి వెళ్లగా తెల్లారి చూసే సరికి ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

వీణవంక, జూన్ 1: మండలంలోని బొంతుపల్లి గ్రామనికి చెందిన చదువు వాసుదేవరెడ్డి (55) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చదువు వాసుదేవరెడ్డిని అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు వేదింపులకు గురి చేయగా మనస్తాపంతో మే 25 తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హన్మకొండకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు వాసుదేవరెడ్డి కూమారుడు చదువు వినయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, జూన్ 1: మండలంలోని వల్భాపూర్‌లో అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా రెండు ఇసుక టాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండారి రమేష్, ఐలవేణి అనిల్ మానేరు వాగులోని ఇసుకను ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తరలిస్తు జమ్మికుంటలో ఎక్కువ ధరలకు విక్రహిస్తున్నట్టు గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చిగురుమామిడి, జూన్ 1: మండలంలోని రేకొండ గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురు మృతుల కుటుంబసభ్యులను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన దుడ్డెల మల్లికాంబ, జున్నూరి శ్రీనివాస్, మ్యాకల మల్లయ్యలు పార్టీ పిలుపు మేరకు నిర్వహించే అన్ని కార్యక్రమల్లో పాల్గొనే వారన్నారు. వారి మృతి పార్టీకి తీరని లోటన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, సింగిల్ విండో డైరెక్టరు చాడ శ్రీధర్‌రెడ్డి, బోయిని పటేల్, తమ్మిశెట్టి ప్రవీణ్, విలాసాగరం, అంజయ్య ఉన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి


జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లిలో భక్తుల ప్రత్యేక పూజలు


గన్నేరువరం మండలం ఖాసింపేటలో భక్తుల పూజలు


కొత్తపల్లిలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

భగత్‌నగర్, జూన్ 1: జిల్లాలో హనుమాన్ జయంతిని శనివారం వైభవంగా నిర్వహించారు. కొత్తపల్లి పట్టణ కేంద్రంలో సర్వేజన సుఖినోభవంతు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షాదారులకు మజ్జిగ, పండ్లు, నిమ్మరసాన్ని పంపిణీ చేశారు. పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కొత్తపల్లి పట్టణంలోని సర్వేజన సుఖినోభవంతు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 30, 31, 1వ తేదీల్లో కొండగట్టు దీక్ష విరమణకు వెళ్తున్న స్వాములకు పండ్లు, మజ్జిగ, నిమ్మరసాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు శ్రీపేరంబుదూరి అఖిల్, జగన్నాథం వినయ్, రాజవరపు మణికంఠ, తిప్పరపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని ఆంజనేయ స్వామి, పాటిమీద ఆంజనేయస్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కొలిపాక శ్రీనివాస్, సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, కాజీపేట శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, కందుగుల గ్రామంలోని భక్తాంజ నేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

●**జమ్మికుంట:** పట్టణంలోని 24వ వార్డు పరిధిలో గల శ్రీసంజీవని ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారికి అభిషేకం, హనుమత్ మహాయాగం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని రవి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయిని రమ పాల్గొన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్ సమీపంలోని వాయుపుత్ర ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవ సంస్థాన్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

●**జమ్మికుంట రూరల్:** మండలంలోని జగ్గయ్యపల్లిలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు మొక్కులు చెల్లించుకున్నారు.

●**శంకరపట్నం:** మండలంలోని కన్నాపూర్‌లోగల పురాతన హనుమాన్ ఆలయంలో మాజీ సర్పంచ్ కాటం వెంకటరమణారెడ్డి-శ్రీమతి దంపతులు ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహం సమర్పించారు. స్వామివారికి, మూలమూర్తులకు పంచామృత అభిషేకం, క్షీరాభిషేకం అర్చకులు మురళీ కృష్ణమాచారి మంత్రోచ్ఛరణాల మధ్య పూజాధికాలు ఘనంగా నిర్వహించారు.

●**మానకొండూర్:** మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తులు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

●**గన్నేరువరం:** మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు.

●**ఇల్లందకుంట:** మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో స్వాములు మాల విరమణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో సుధాకర్ అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

-న్యాయం చేయాలని సీఎండీకి లైన్‌మన్ వేడుకోలు

హనుమకొండ టౌన్, జూన్1: యూనియన్ ముసుగులో ఇద్దరు వ్యక్తులు తనను మోసం చేసి ఉద్యోగం పోగొట్టి రోడ్డున పడేశారని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని హుజూరాబాద్ డివిజన్ సైదాపూర్ సెక్షన్ లైన్‌మెన్ ఆర్.సంపతి సీఎండీ వరుణ్‌రెడ్డిని వేడుకుంటున్నారు. బాధితుడి కథనం ప్రకారం కరీంనగర్ సర్కిల్ సైదాపూర్ సెక్షన్‌లో సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.సంపతిని 1104 సంఘానికి చెందిన చెలమల్ల సైదాపూర్ ఎస్ఎల్ఐ తిరుపతిరెడ్డి, భీమదేవరపల్లి జేపీవో షకీల్ కలిశారు. నీ కొడుకుకు ఇప్పిస్తామని నమ్మించి రూ.4లక్షలు తీసుకొని కొన్ని పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. ఇక నుంచి డ్యూటీకి వెళ్లాల్సిన అవసరం లేదని నమ్మబలికారు. ఇలా 2014 నుంచి 2023 వరకు 9 యేళ్ల గడిచిన తర్వాత సర్వీస్ ఫర్ రిమూవల్ అంటూ సంపతి ఇంటికి లెటర్ వచ్చింది. ఇదేంటని షకీల్, తిరుపతిని అడిగితే మేము చూసుకుంటాం.. ఏం కాదు.. అని దాటేశారు. ఒక రోజు ఎస్ఈ కార్యాలయానికి సంపతిని తీసుకెళ్లి ఫైల్ చూపించారు. తన కొడుకుకు ఫైల్ చూపించాలని అడగగా తప్పించుకొని తిరిగారు. కొన్ని రోజులకు తన కొడుకు సర్కిల్ ఆఫీస్‌కు వెళ్లి ఆరా తీయగా మీకు సంబంధించిన ఫైల్ లేదని ఎస్ఈ చెప్పారన్నారు. వెంటనే అప్పటి సీఎండీ గోపాల్‌రావుకు ఫిర్యాదుచేయగా సీజీఎం రవీంద్రనాథ్, జీఎం మల్లిఖార్జున్ విచారణ చేశారన్నారు. ఇద్దరి మోసంవల్ల వృద్ధాప్య జీవితాన్ని దయనీయమైన స్థితిలో గడుపుతున్నానని, న్యాయం చేయాలని సీఎండీని వేడుకున్నాడు. అయితే ఏప్రిల్ 6న సీఎండీకి ఇదే విషయంపై ఫిర్యాదు చేశారనని, ఇప్పటికి వరకు ఎలాంటి స్పందన లేదని బాధితుడు వాపోతున్నాడు.

నైపుణ్యం సాధిస్తే డిగ్రీతో కొలువులు

-కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

గణేశ్‌నగర్, జూన్1: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కోర్సులు పూర్తవగానే కొలువులు కొట్టాలంటే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. డిగ్రీలో చేరి కోర్సు పూర్తవక ముందే ఉద్యోగాలు సాధిస్తున్నారు పలువురు విద్యార్థులు. కార్పొరేట్ సంస్థలు సైతం బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏతో పాటు డిగ్రీ వారి కోసం ప్రత్యేకంగా అన్వేషిస్తున్నాయి. కొన్ని బహుళ జాతీయ సంస్థలు ప్రత్యేకంగా డిగ్రీ వారినే ఎంపిక చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీని కోసం కరీంనగర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని డిగ్రీ కళాశాలలు విద్యార్థులకు నైపుణ్యాంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాయి. దీంతో విద్యార్థులు డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలు సాధిస్తున్నారు.

వివిధ అంశాల్లో శిక్షణ

శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగాలు సాధించేందుకు కావాల్సిన అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. గ్రూప్ డిస్కషన్, కమ్యూనికేషన్ స్కిల్స్ సాఫ్ట్ స్కిల్స్, మానవత విలువలు, టీంవర్క్, ఇంటర్వ్యూ స్కిల్స్, రెజ్యూం తయారు చేసుకునే విధానం, లైఫ్ స్కిల్స్, టైం మేనేజ్‌మెంట్, పేపర్ ప్రెజెంటేషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. కళాశాలలు వివిధ కంపెనీలను ప్రాంగణ నియామకాలకు ఆహ్వానిస్తున్నాయి.



విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

-శ్రీనివాస్, శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్



విద్యార్థులకు డిగ్రీ కోర్సులో చేరినప్పటి నుండే పాఠ్యాంశాలతో పాటు ఉద్యోగ నైపుణ్య శిక్షణకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విషయ నిపు ణులు, గెస్ట్ లెక్చరర్స్‌తో పాటు ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తాం. డిగ్రీ కోర్సులు పూర్తవగానే నేరుగా ఉద్యోగాల్లో చేరే విధంగా శిక్షణ ఇస్తున్నాం. సాఫ్ట్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్ తరగతులకు విద్యార్థులు ఆసక్తిగా హాజరవుతున్నారు.

మెళకువలు చేర్చుకోవాలి

-మెరుగు నికిత, డిగ్రీ విద్యార్థిని



ఉద్యోగాలు సాధించాలంటే కంపెనీల అవసరాలకు అనుగుణంగా మెళకువలు నేర్చుకోవాల్సిందే. ఇటీవల జరిగిన ఇంటర్వ్యూల్లో నాకు ప్రముఖ కంపెనీ హైదరాబాద్‌లో జాబ్ వచ్చింది. కళాశాలలో ఇచ్చిన ప్రత్యేక శిక్షణ ఇందుకు తోడ్పడింది.

స్కిల్స్ ఉంటేనే ఉద్యోగం సాధిస్తాం

-డిగ్రీ విద్యార్థి, మహ్మద్ ఇష్ఫేకర్



ఉద్యోగం సాధించాలంటే పాఠ్యాంశాలతో పాటు స్కిల్స్ ఉంటేనే సాధ్యం. నేను ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. సందర్భాన్ని అనుసరించి ఎలా మాట్లాడాలో నేర్చుకోవాలి. దీనిపై కళాశాలలో మొదటి నుంచి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. దీంతో ఇటీవల జరిగిన ప్లేస్‌మెంట్‌లో మెడికో హెల్త్ కేర్‌లో జాబ్ సాధించా.

యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సజ్జద్

జమ్మికుంట, జూన్ 1: హుజూరాబాద్ నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ సజ్జద్‌ను నియమిస్తూ ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బీవీ శ్రీనివాస్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

హుజూరాబాద్, జూన్ 1: రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల తర్వాత ప్రజలు కోరుకున్న, ప్రజలు ఆకాంక్షించిన తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఆదివారం తెలంగాణ వేడుకలు ప్రతీ గ్రామాన ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. తెలంగాణ దినోత్సవ ఉత్సవాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

కొవ్వొత్తుల ర్యాలీ

చిగురుమామిడి, జూన్ 1: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద అమర వీరుల స్థూపం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ ఎంపీటీసీ కత్తుల రమేష్‌యాదవ్, దుడ్డెల లక్ష్మీనారాయణ, రాజిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు. తెలంగాణా అమరవీరులు ఆశయసాధన బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు.

రామడుగు క్రికెట్ క్లబ్ కార్యవర్గం

రామడుగు, జూన్ 1: రామడుగు మండల క్రికెట్ క్లబ్ కార్యవర్గం శనివారం ఏర్పాటు అయింది. అధ్యక్షుడిగా ఎడవెల్లి ఆనందరెడ్డి, ఉపాధ్యక్షులుగా ముంజాల ప్రవీణ్, ఆరపల్లి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా నీలం చందు, సహాయ కార్యదర్శిగా కొత్త రమేశ్, కార్యదర్శులుగా తిరుపతి, ఫిరోజ్, మనోజ్, సలహదారుగా వినయ్, సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు.

'కబ్జాకు గురవుతున్న చెరువు కట్టను రక్షించండి'

గన్నేరువరం, జూన్ 1: మండలంలోని మైలారంలో చెరువు కట్టను ఓ రైతు కబ్జా చేస్తున్నాడని అతడి నుంచి రక్షించాలని కోరుతూ గ్రామంలోని పలువురు మత్స్యకారులు శనివారం నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా మత్స్యకారు డు గువ్వ రాజు మాట్లాడుతూ చెరువు కట్టను తవ్వడంతో కట్ట బలహీనంగా తయారైందన్నారు. వర్షాకాలం చెరువు నిండితే కట్టకు గండి పడే ప్రమాదం ఉందన్నారు. చెరువును నమ్ముకుని జీవిస్తున్నామని చెరువుకు గండి పడితే చేపల పెంపకానికి నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి చెరువు కట్టను తవ్వి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని చెరువు కట్టకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు గువ్వ మల్లయ్య, నాయకులు గువ్వ కనుకయ్య, శ్రీనివాస్, వెంకటేష్, కుమార్, రామస్వామి, సుమన్, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయం నుంచి కాపాడిన వ్యక్తికి సన్మానం

శంకరపట్నం, జూన్ 1: మండలంలోని కాచాపూర్‌లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు చేస్తుండగా స్పృహ కోల్పోయి పడిపోయిన ఓ వ్యక్తిని సీపీఆర్ చేసి కాపాడిన గట్టు నాగరాజును గ్రామస్థులు సన్మానించారు. కాచాపూర్ గ్రామానికి చెందిన పోలోజు మల్లాచారి మూడ్రోజుల క్రితం ఊర చెరువులో ఉపాధిహామీ పనిచేస్తుండగా పనిప్రదేశంలో ఒక్కసారిగా స్పృహ కోల్పోయి పడిపోయాడు. పక్కనే ఉన్న గట్టు నాగరాజు అది గమనించి వెంటనే అప్రమత్తమై సీపీఆర్ చేశాడు. అతను కొంత స్పృహలోకి రాగానే ఆస్పత్రికి తరలించారు. దీంతో శనివారం నాగరాజును సన్మానించి అభినందనలు తెలిపారు.

సంతకాల సేకరణ

హుజూరాబాద్‌రూరల్, జూన్ 1: మండలంలోని సింగాపూర్‌లోగల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సంతకాల దినోత్సవం జరిగింది. మెకానికల్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు సంతకాలు దినోత్సవం నిర్వహించుకున్నారు. టీ షర్టులపై సంతకాలను చేసుకుని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కోరపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

జమ్మికుంట రూరల్, జూన్ 1: మండలం లోని కోరపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2000-2001సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 సంవత్సరాల తర్వాత అందరు ఒకే చోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు విట్టల్‌రావు, సారయ్య, శ్రీనివాస్, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు మిడిదొడ్డి సమ్మయ్యను సన్మానించారు. కార్యక్రమంలో పైడిపల్లి రమేష్, కల్లెపల్లి యాదగిరి, వజ్జెపల్లి శ్రీనివాస్, కన్న నరేష్, నాగలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో డీఎల్పీవో విచారణ


డీఎల్పీవోకు వాంగ్మూలం అందజేస్తున్న ఫిర్యాదుదారులు

శంకరపట్నం, జూన్ 1: మండలంలోని లింగాపూర్ గ్రామంలో హుజూరాబాద్ డీఎల్పీవో పాత శ్రీనివాస్ శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులు జరగడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని, మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి డబ్బులు అందలేదని కలెక్టర్‌కు, డీపీవోకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్పీవో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎల్పీవో ఫిర్యాదుదారులు, పంచాయతీ కార్యదర్శి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండు నెలల నుంచి గ్రామంలో అభివృద్ధి పనులు కుంటు పడ్డాయని ప్రజలు ఆరోపించారు. ఫిర్యాదుదారు రాజిరెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతా యా అని ప్రశ్నించారు. గ్రామంలో ప్రతిసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తేనే పనులు జరుగుతాయా అని మండిపడ్డారు. అనంతరం డీఎల్పీవో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీవో బషీరుద్దీన్, ప్రత్యేకాధికారి, ఏఈ మొగిలయ్య, పంచాయతీకార్యదర్శి పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కరీంనగర్ టౌన్, జూన్ 1: ది గాయత్రీ కో ఆపరేటివ్ బ్యాంకు, కరీంనగర్ శాఖ బ్యాంకు ఖాతాదారుడు కాశిపాక శంకర్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందగా ఆయన భార్య కాశిపాక శంకరవ్వకు లక్ష రూపాయల చెక్కును బ్యాంకు ఆవరణలో మేయర్ సునీల్‌రావు, బ్రాంచి మేనేజర్ జి.అశోక్, జూనియర్ ఆఫీసర్ వి.విష్ణుప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గాయత్రీ కో ఆపరేటివ్ బ్యాంకు, కరీంనగర్ శాఖ తమ ఖాతాదారులకు బీమా సౌకర్యాన్ని కల్పించి, ప్రమాదవశాత్తు మృతిచెందిన ఖాతాదారుల కుటుంబాలకు లక్ష రూపాయల బీమా మొత్తాన్ని అందజేయడం అభినందనీయమని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు.

ఖాతాదారు లకు కనీస డిపాజిట్ మొత్తంతో నిర్భయ సేవింగ్ ఖాతా తెరచి ప్రమాదవశాత్తు మృతిచెందిన ఖాతాదారు కుటుంబానికి లక్ష రూపా యల బీమా ఇవ్వడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ అశోక్ బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న సేవలను వివరించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

భగత్‌నగర్, జూన్ 1: కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్‌లో మాజీ ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ శనివారం ప్రారం భించారు. ఖాజీపూర్-నాగులమల్యాల జట్ల మధ్య తొలి మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడల ద్వారా స్నేహభావం పెంపొందించుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లకు ఆకర్షితులవుతూ క్రీడలకు యువత దూరమవుతున్నారన్నారు. క్రీడలకు సమయాన్ని కేటాయించి శరీర దృఢత్వం సాధించుకోవాలన్నారు.

ఈ పోటీల్లో విజేతలకు 15 వేల రూపాయలు, రన్నరప్‌కు 8 వేల రూపాయలు అందించనున్నట్లు క్రికెట్ పోటీల నిర్వాహకులు మాజీ మార్కెట్ చైర్మన్ రెడ్డవేణి మధు తెలిపారు. ఈకార్యక్రమంలో జెడ్పి కో-అప్షన్ సభ్యుడు సాబీర్ పాష, ఎంపిటీసీ దావ కమల మనోహర్, మాజీ ఎంపిటీసీలు కడారి శ్రీనివాస్, పెంచాల అంజనేయులు, పెంచాల తిరుపతి, జుట్టు దేవేందర్, గాలిపెల్లి రవీందర్, బొలుసాని అంజనేయులు, బూస కరుణాకర్, కటుకం కరుణాకర్, కుమార్, రాజుల మణి, కాలియప్ప, నరేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం'

మానకొండూర్, జూన్ 1: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో మానకొండూర్‌లో జరిగిన అభివృద్ధి శూన్యమని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోండ్ర సురేష్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుడా చైర్మన్‌గా కొనసాగిన జీవీ రామకృష్ణారావు మానకొండూర్ అభివృద్ధికి పైసా నిధులు మంజూరు చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బుర్ర శ్రీకాంత్, రాపాక సుభాష్, సయ్యద్ ముబషీర్, నడిగొట్టు క్రాంతి, ఎండీ అజారోద్దీన్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

రామడుగు, జూన్ 1: రామడుగులో నెల రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. రిటైర్డ్ పీఈటీ మునీర్, వాలీబాల్ కోచ్ సుంకె ఆశాలు, బర్కత్, శ్రీనివాస్, కృష్ణ, ఇమ్రాన్, మునీందర్, శ్రీకాంత్, విద్యార్థులు ఉన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

చొప్పదండి, జూన్ 1: చొప్పదండిలో రోడ్ వెడల్పు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా చైర్మన్ వడ్లూరి గంగరాజు అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రోడ్డు వెడల్పు పనులను మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానం

చిగురుమామిడి,జూన్ 1: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గంప సంపత్‌కు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరు కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం ఆహ్వానం పంపింది. తెలంగాణ విద్యావంతుల వేదిక ఉమ్మడి జిల్లా కార్యదర్శి గా సంపత్ దాదాపు వెయ్యిమంది మహిళలతో వంద రోజుల పాటు నిరాహార దీక్షలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్

హుజూరాబాద్‌రూరల్, జూన్ 1: మండలంలోని సింగాపూర్‌లోగల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న అర్షణపల్లి మహేందర్ రావుకు డాక్టరేట్ వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. ఈశ్వరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైతన్య యూనివర్సిటీలో ప్రొఫెసర్ దోమల సురేష్ పర్యవేక్షణలో సింతెసిస్ అండ్ క్యారెక్టరీజేషన్ ఆఫ్ పాలి మర్ మెటల్ కాంప్లెక్స్ హైబ్రిడ్ ఫోటో కాటలిస్ట్ ఫర్ డిగ్రాడేషన్ ఆఫ్ ఆర్గానిక్ పొల్లుటెంట్స్ అనే అంశంపై ప్రఖ్యాత అంతర్జాతీయ స్థాయిలోని జర్నల్స్‌లలో రెండు పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఈ మేరకు యూనివర్సిటీ కంట్రోల్ ఎగ్జామినేషనర్ ప్రొఫెసర్ జగదీశ్వర్ పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.